## వైభవంగా అక్షత కలశ శోభాయాత్ర



ప్రగతినగర్‌లోని శ్రీపట్టాభి రామాంజనేయస్వామి ఆలయం వద్ద శోభాయాత్రను ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

**నిజాంపేట్:** శ్రీరామ జన్మభూమి పూజిత 'అక్షత కలశ శోభాయాత్ర' ఆదివారం ప్రగతినగర్‌లో వైభవోపేతంగా జరిగింది. ప్రగతినగర్‌లోని శ్రీపట్టాభి రామాంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి శోభాయాత్రను ప్రారంభించారు. త్రయోదశాక్షరి మంత్ర జపం, శ్రీరామ భజనలు, భక్తుల కోలాటాల మధ్య ఈ శోభాయాత్ర ప్రగతినగర్‌లోని పురవీధుల గుండా కొనసాగగా ప్రజలు నీరాజనాలు పలికారు. సోమవారం నుంచి ఇంటింటికీ అక్షింతలు అందజేస్తామన్నారు. పవిత్ర శ్రీరామ కార్యంలో పాల్గొనే హిందూ బంధువులెవరైనా సంచాలన సమితి, ఆలయ కమిటీని సంప్రదించాలని కోరారు.



శ్రీరామ జన్మభూమి పూజిత అక్షత కలశ శోభాయాత్రలో పాల్గొన్న భక్త జనం

## మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు



మంత్రి శ్రీధర్‌బాబుతో కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఐటీ శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుకు కొలన్ హన్మంతరెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరు గ్యారంటీలు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు. వారి వెంట నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇది ఆటో డ్రైవర్ కథ!

ఆటో టాప్ తీసేసి రంగులు విక్రయిస్తున్న వైనం

**సుభాష్‌నగర్:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో, ఆటో వాళ్లలపై తీవ్ర ప్రభావం పడిందనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆటో డ్రైవర్ మనోజ్ తన ప్యాసింజర్ ఆటో పై భాగం తీసేసి నూతన సంవత్సరానికి ఉపయోగపడే రంగు ముగ్గులు విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ మనోజ్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆటోలో ఎక్కడానికి మహిళలు రాకపోవడంతో గతంలో వచ్చే సంపాదనలో 25 శాతం కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయంగా తమ వాహనంలో కూరగాయలు, కర్రీస్, చట్నీలు, తినుబండారాలు, దుస్తులు వంటి వాటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇక ఇదే విధంగా కొనసాగితే తమ బతుకు అగమ్య గోచరంగా మారిందని వాపోయాడు.



టాప్ లేని ప్యాసింజర్ ఆటోలో రంగులు విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ మనోజ్

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



మేడ్చల్, రంగారెడ్డి టీచర్స్ యూనియన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

**నిజాంపేట్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ టీచర్స్ యూనియన్ మేడ్చల్, రంగారెడ్డి జిల్లా శాఖల వార్షిక కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేసిందన్నారు. స్థానిక ఉపాధ్యాయులను స్థానికేతరులుగా మార్చి సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి పైశాచిక ఆనందం పొందిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అన్ని యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వ ప్రవేశపెట్టిన జీవో 317ను ఉపసంహరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి, జిల్లాల ప్రధాన కార్యదర్శులు రఘునందన్ రావు, రమేష్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మోహన్, రవీందర్ తదితరులు ఉన్నారు.

## కార్మికుల అభ్యున్నతికే పని చేస్తాం

**కుత్బుల్లాపూర్:** సంఘటిత, అసంఘటిత కార్మికుల అభ్యున్నతికి వామపక్ష యూనియన్లు నిరంతరం పని చేస్తుంటాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్ అన్నారు. జీడిమెట్ల, ప్రగతినగర్ ఎలీఫ్, గండి మైసమ్మ తదితర పారిశ్రామిక ప్రాంతాల లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ యూనియన్ నూతన అడ్డాను జీడిమెట్ల పారిశ్రామిక వాడ ఫేజ్-4లో ప్రారంభించిన సందర్భంగా ఆదివారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.

## తిరుమలలో ఎమ్మెల్సీ పూజలు

**కుత్బుల్లాపూర్:** తెలంగాణ శాసనమండలి సభ్యుడు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు ఆదివారం తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



కుటుంబ సమేతంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు